క్లుప్తంగా

నమస్తే మేడమ్..



రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు అభివాదం చేస్తున్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం రూరల్: భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాష్ట్రపతి భవన్‌లో బుధవారం ఇచ్చిన అల్పాహార విందుకు వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్ హాజరయ్యారు. ఈ ఆతిథ్యంలో ఉపరాష్ట్రపతి జగదీష్ ధన్‌కర్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కేంద్ర మంత్రులు, రాజ్యసభ, లోక్‌సభ సభ్యులు పాల్గొన్నారు.

అవగాహనతోనే క్షయ నిర్మూలన



కడియం ప్రభుత్వ ఆసుపత్రిలో అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

కడియం: అవగాహన పెంచుకోవడం ద్వారా క్షయవ్యాధిని నిర్మూలించగలమని కడియం టీబీ యూనిట్ సూపర్‌వైజర్ జి.శేషగిరిరావు అన్నారు. ఆరోగ్యమేళా కార్యక్రమంలో భాగంగా స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద టీబీపై బుధవారం ప్రత్యేక అవగాహనా సదస్సు నిర్వహించారు. వ్యాధి లక్షణాలు, నివారణా చర్యలను శేషగిరి రావు వివరించారు. ప్రభుత్వం ద్వారా క్షయ వ్యాధిగ్రస్తులకు అందజేస్తున్న పథకాలను తెలిపారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నీలిమ బిందు మాట్లాడుతూ క్షయ ఒకరి నుంచి మరొకరికి వేగంగా వ్యాప్తిస్తుందన్నారు. ముందుగానే గుర్తించి చికిత్స తీసుకోవాలన్నారు.

పలుకు విద్యార్థులకు అల్పాహారం వితరణ



అల్పాహారం అందజేస్తున్న విజయకుమార్ తదితరులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): బహుజన్ సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు కాన్షీరామ్ జయంతి సందర్భంగా బుధవారం రూరల్ నియోజకవర్గం ఉపాధ్యక్షుడు కొండపల్లి సూరి ఆధ్వర్యంలో స్థానిక ఐటీసీ సమీపంలోని పలుకు ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు అల్పాహారం అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అధ్యక్షుడు పట్నాల విజయ్‌కుమార్ మాట్లాడుతూ బహుజనులను చైతన్య పరిచిన వ్యక్తి కాన్షీరామ్ అని కొనియాడారు. జిల్లా ఇన్‌చార్జి పడమటి గణేశ్వరరావు, ఇసుకపట్ల రాంబాబు, గెద్దం ప్రసాద్, కొత్తపల్లి శేఖర్, మండా సుబ్రహ్మణ్యం, వరాలు, జి.సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

కడియం: మురమండలోని పిచ్చుగ కోటయ్య ప్రభుత్వ జూనియర్ కాలేజీలోని పరీక్షా కేంద్రంలో ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండల పరిధిలో 167 మందికి గాను 159 మంది పరీక్షలకు హాజరయ్యారని ఆర్‌ఐవో ఎస్‌ఎస్‌వీఎల్ నరసింహారావు తెలిపారు.

వెంకన్న హుండీ ఆదాయం రూ.1.49 లక్షలు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్నఅధికారులు, భక్తులు

ధవళేశ్వరం: స్థానిక వేంకటేశ్వరస్వామికి హుండీ ద్వారా గడిచిన మూడు నెలలకు రూ.1,49,424 సమకూరింది. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.పెద్దిరాజు సమక్షంలో బుధవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. కార్యక్రమంలో దేవస్థానం మాజీ చైర్మన్ సాధనాల చంద్రశేఖర(శివ), కొప్పిశెట్టి కోటేశ్వరరావు, ఎస్.సుబ్బారావు, ఇందల శ్రీను, ఎం.తులసీరాం పాల్గొన్నారు.

నేటి నుంచి ఆలయ ప్రతిష్ఠాపనోత్సవాలు

రాజమహేంద్రవరం రూరల్: తొర్రేడులోని ఒను వులమ్మ తల్లి ఆలయ పునఃప్రతిష్ఠాపనోత్సవాలు గురువారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. వేదపండితుడు సత్యనారాయణశాస్త్రి ఆధ్వర్యంలో గురువారం నుంచి ఈ నెల18వ తేదీ వరకు జరుగుతాయన్నారు. 18వ తేదీ శనివారం ఉదయం 10.18 గంటలకు అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం, యంత్రస్థాపన, పూర్ణాహుతి, అనంతరం భారీ అన్నసమారాధన ఉంటుందన్నారు. కాగా.. గురువారం విఘ్నేశ్వర పూజ, దీక్షాధారణ, అఖండ దీపారాధన, శుక్రవారం వాస్తుపూజ, క్షీరాభిషేకం, జలాదివాసం నిర్వహిస్తామన్నారు. మూడు రోజుల పాటు జరిగే పూజా కార్యక్రమాల్లో భక్తులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

చకచకా.. పశువులకు టీకా..



పశువులకు టీకాలు వేస్తున్న వైద్యుడు

- విస్తృతంగా ఉచిత వ్యాక్సినేషన్
- వినియోగించుకోవాలని కోరుతున్న పశువైద్యులు

కడియం: వాతావరణ మార్పుల నేపథ్యంలో పశువులకు వచ్చే వివిధ రకాల వ్యాధుల నుంచి రక్షణ కల్పించేందుకు టీకాలు వేయించడం ఎంతో అవసరమని పశు వైద్యనిపుణులు చెబుతున్నారు. ప్రస్తుత సీజన్‌లో పశువులకు గాలికుంటు వ్యాధి వ్యాపిస్తోంది. ఈ వ్యాధి కారణంగా పాలు తగ్గిపోవడం, పశువు ఆరోగ్యం బాగా క్షీణించడంతోపాటు, ఒక్కోసారి మృతి చెందుతుంది. ఈ నేపథ్యంలో విలువైన పశువులను కాపాడుకోవాలంటే గాలికుంటు నిరోధక టీకా వేయడం ఒక్కటే మార్గం.

ఉచితంగా టీకాలు

పశు సంపదను రక్షించుకునేందుకు ప్రభుత్వం ఉచితంగా వాక్సినేషన్ చేపడుతోంది. మార్చి ఒకటి నుంచి దశల వారీగా జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమం ప్రారంభించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో పశువులకు టీకాలను వేస్తున్నారు. ఇందుకోసం కలెక్టర్ మాధవీలత పర్యవేక్షణలో, వెటర్నరీ ఏడీ డాక్టర్ కల్లూరి సత్యనారాయణ ఆధ్వర్యంలో పశువైద్య సిబ్బంది పక్కా ప్రణాళికలు రూపొందించారు. ప్రతి పశువుకు వాక్సిన్ అందే విధంగా చర్యలు తీసుకుంటున్నారు.

డివిజన్‌లో పశు సంపద

రాజమహేంద్రవరం డివిజన్‌లో పశుసంపద గణన వివరాలు ఇప్పటికే సంబంధిత సిబ్బంది వద్ద ఉన్నాయి. వీటి ప్రకారం డివిజన్‌లో ఆవులు 40,499, గేదెలు 99,175.. మొత్తం 1,39,674 ఉన్నాయని లెక్కించారు. వీటిలో 80 శాతం వాటికి వాక్సినేషన్, 10 శాతం వాటికి బూస్టర్ డోస్‌లు అందించేందుకు కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నారు. డివిజన్‌లో దాదాపు 1,22,950 డోసులు ప్రస్తుత సీజన్‌లో అందించనున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

రైతులు పశుపోషణను అదనపు ఆదాయంగా పరిగణిస్తారు. వాటికి ఏమైనా వ్యాధులు సోకితే తీరని నష్టం ఏర్పడుతుంది. పశువులను కాపాడుకునేందుకు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలి. ప్రస్తుతం గాలికుంటు నిరోధక టీకాలను ప్రభుత్వం ఉచితంగా అందజేస్తోంది. ఈ అవకాశాన్ని ప్రతి పశుపోషకుడు సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ కల్లూరి సత్యనారాయణ, రాజమహేంద్రవరం, వెటర్నరీ ఏడీ

వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జుల నియామకం



బూరాడ భవానీ శంకర్



నామన వాసు



ఏవీ రమణ

రాజమహేంద్రవరం సిటీ: క్షేత్రస్థాయిలో వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేసేందుకు అవసరమైన ప్రణాళికలు చేపట్టినట్లు పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి అన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం మాట్లాడుతూ నగరంలో మూడు డివిజన్లకు పార్టీ ఇన్‌చార్జులను నియమించామన్నారు. ఉభయ గోదావరి జిల్లాల పార్టీ కోఆర్డినేటర్లు ఎంపీ మిథున్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాస్ చంద్రబోస్, ఎంపీ మార్గాని భరత్ రామ్ సంయుక్తంగా ఈ నియామక ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. మొదటి విడతగా గత నెలలో నాలుగు డివిజన్లలో ఇన్‌చార్జుల మార్పు చేపట్టామన్నారు. రెండో విడతలో 21వ డివిజన్‌కు మాజీ కార్పొరేటర్ ఏవీ రమణ, 42వ డివిజన్‌కు నామన వాసు, 44వ డివిజన్‌కు బూరాడ భవానీ శంకర్‌ను నియమిస్తూ పార్టీ అధినాయకత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు.

నర్సరీని సందర్శించిన బ్యాంకు ఉన్నతాధికారులు



గౌతమి నర్సరీలో బ్యాంకు ఉన్నతాధికారులు

కడియం: స్థానిక గౌతమి నర్సరీని నాబార్డు చీఫ్ జనరల్ మేనేజర్ ఎంఆర్ గోపాల్, చైతన్య గోదావరి గ్రామీణబ్యాంకు చైర్మన్ టి.కామేశ్వరరావు బుధవారం సందర్శించారు. వివిధ రకాల మొక్కలు, నర్సరీల నిర్వహణ తదితర విషయాలను నర్సరీ రైతు మార్గాని వెంకట శేషు వారికి వివరించారు. దేశ, విదేశాలకు చెందిన వివిధ రకాల మొక్కలను సేకరించి, వాటిని ఇక్కడ అభివృద్ధి చేస్తామన్నారు. నర్సరీ రంగ ప్రముఖులు మార్గాని సత్యనారాయణ మాట్లాడుతూ బ్యాంకు రుణాలపై వడ్డీ చిన్నకమతాల రైతులకు ఇబ్బందికరంగా ఉంటోందని, ప్రాసెసింగ్ చార్జీలు భారంగా ఉంటున్నాయని వారి దృష్టికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో బ్యాంకు రీజినల్ మేనేజర్ శ్రీనివాసు పర్ల, వీరవరం బ్రాంచి మేనేజర్ వెంకట సందీప్, సిబ్బంది పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న జేవీఎస్‌వీ ప్రసాద్

రాజమహేంద్రవరం సిటీ: ప్రతి వినియోగదారుడు తమ హక్కులను తెలుసుకోవాలని, ఏదైనా నష్టం జరిగితే కోర్టును ఆశ్రయించి న్యాయం పొందవచ్చని జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు జేవీఎస్‌వీ ప్రసాద్ పిలుపు నిచ్చారు. ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా సబ్ కలెక్టర్ కార్యాలయంలో బుధవారం జిల్లా వినియోగదారుల ఆహార, పౌరసరఫరాలశాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు, వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుల కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. కార్యక్రమంలో డీసీపీసీ సభ్యుడు గొట్టిముక్కల అనంతరావు, జిల్లా పౌరసరఫరాల అధికారి పి.ప్రసాదరావు, లీగల్ మెట్రోలజీ అసిస్టెంట్ కంట్రోలర్ ఏఎస్ రాజు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రుక్కయ్య, అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎన్.వసుంధర, ఎలక్ట్రిసిటీ ఏఈఈ ఫణి కుమార్, జిల్లా రవాణాశాఖ కృష్ణ కుమార్, డిప్యూటీ స్కూల్స్ ఇన్‌స్పెక్టర్ దిలీప్ కుమార్ పాల్గొన్నారు.

జగన్ పాలనపై అన్నివర్గాల సంతృప్తి

- 'నా నమ్మకం నువ్వే జగనన్న' మార్మోగాలి
- ఏపీజీఅండ్‌బీసీ చైర్మన్, కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్



సమావేశంలో మాట్లాడుతున్న చందన నాగేశ్వర్

రాజమహేంద్రవరం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై అన్ని వర్గాల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, పార్టీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. వైఎస్సార్ సీపీ రూరల్ నియోజకవర్గ కార్యాలయంలో బుధవారం జగనన్న సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చందన నాగేశ్వర్ మాట్లాడుతూ ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలతో పాటు అనూహ్యమైన అభివృద్ధి, అవినీతి రహిత పాలన కొనసాగాలంటే మనకున్న ఏకైక నమ్మకం ముఖ్యమంత్రి జగనన్న మాత్రమేనన్నారు. అందువల్ల మా నమ్మకం నువ్వే జగనన్న అనే నినాదాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. గతంలో రావాలి జగన్, కావాలి జగన్ అనే నినాదం ప్రజల్లోకి వెళ్లడం వల్లే 2019లో ఘన విజయం సాధ్యమైందన్నారు. 2019 నుంచి ఇప్పటి వరకూ జరిగిన అభివృద్ధి, ప్రజలు అందుకున్న సంక్షేమ పథకాల కారణంగా మా నమ్మకం నువ్వే జగనన్న అనే నినాదం ప్రజల హృదయాల్లోంచి వస్తోందన్నారు.

త్వరలో గృహసారథుల కార్యాచరణ

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అనంతరం రాష్ట్రమంతటా 175 నియోజకవర్గాల్లో గృహసారథుల కార్యాచరణను మొదలవుతుందని చందన నాగేశ్వర్ అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏర్పాటు చేసిన వలంటీర్లపై అపారమైన విశ్వాసం ఉంచామన్నారు. రూరల్ కోఆర్డినేటర్‌తో పాటు ఏపీగ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్‌గా తనకు బాధ్యతలు అప్పగించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో గౌరవం ఇచ్చారన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు, ఖాదీబోర్డు వైస్ చైర్మన్ పిల్లి నిర్మల, జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు ముద్దాల అను, రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ మరిడయ్య, హితకారిణి సమాజం డైరెక్టర్ దేవులపల్లి సరితారాణి, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పాలిక శ్రీను, ఇన్నీసుపేట కోపరేటివ్ బ్యాంక్ వైస్ చైర్మన్ గేడి అన్నపూర్ణరాజు, జేసీఎస్ కన్వీనర్లు తాటికొండ విష్ణుమూర్తి, రాజమౌళి, మాజీ కార్పొరేటర్ మింది మాధవి, ఆర్యాపురం బ్యాంక్ డైరెక్టర్ బిల్డర్ చిన్న, చీరా రాజు పాల్గొన్నారు.

ఘనంగా గోరంట్ల జన్మదిన వేడుకలు



రజకులకు ఇస్త్రీపెట్టె, బండి అందజేస్తున్న రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి

రాజమహేంద్రవరం రూరల్: టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి జన్మదిన వేడుకలు బుధవారం ఆయన నివాసంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే గోరంట్ల ఈ సందర్భంగా పిడింగొయ్యి బుచ్చయ్య నగర్‌లోని సోమాలమ్మ ఆలయ ధ్వజస్తంభం నిర్మాణానికి రూ.50 వేలు, కాతేరులోని విశ్వబ్రాహ్మణ గుడి నిర్మాణానికి రూ.25 వేలు, ఎస్సీపేటలోని కృష్ణుని గుడికి రూ.25 వేలను కమిటీ సభ్యులకు అందజేశారు. వేమగిరికి చెందిన రజకులకు రూ.20 వేల విలువైన ఇస్త్రీపెట్టె, తోపుడుబండి, వివిధ ప్రాంతాలకు చెందిన వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. ధవళేశ్వరానికి చెందిన సావాడ శ్రీనివాసరెడ్డి సమకూర్చిన మూడు దివ్యాంగుల సైకిళ్లను పంపిణీ చేశారు. నియోజకవర్గ పరిధిలో 1200 మంది పేదలకు ఆహార పొట్లాలు అందజేశారు. పలుకు ఆశ్రమ పాఠశాలలో గోరంట్ల కేక్‌కట్ చేశారు. ఆ సంస్థ నిర్వాహకులకు రూ.10 వేలు అందించారు.

టెన్త్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



లూథరన్ పాఠశాలలను సందర్శించిన డీఐ దిలీప్ కుమార్

కంబాలచెరువు: స్థానిక జాంపేట లూథరన్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలను అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్‌కుమార్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఫార్మెటివ్ పరీక్షల నిర్వహణను పరిశీలించి సూచనలు చేశారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, చదివించాలన్నారు. పది విద్యార్థులు నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని, దీనికి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. హెచ్‌ఎం జెమిమా, ఉపాధ్యాయులు మార్టిన్ పాల్గొన్నారు.

కరీంఖాన్‌కు పరామర్శ



కరీంఖాన్‌ను పరామర్శిస్తున్న శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం

ప్రకాశం నగర్: పుత్రవియోగంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ మైనారిటీ విభాగం నాయకుడు, జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ కరీంఖాన్‌ను ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం పరామర్శించారు. ఆయన బుధవారం దానవాయిపేట గానుగవీధిలోని కరీంఖాన్ ఇంటికి వెళ్లారు. కరీంఖాన్ పెద్ద కుమారుడు ఇద్రీస్ ఖాన్ (36) అనారోగ్యంతో ఇటీవల హైదరాబాద్‌లోని ఒక ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. అలాగే వైఎస్సార్ సీపీ 7వ వార్డు ఇన్‌చార్జి గౌస్, ది ఇన్నీసుపేట కోఆపరేటివ్ బ్యాంకు డైరెక్టర్ సన్నీ, తోరాటి వెంకటేశ్వరరావు పరామర్శించిన వారిలో ఉన్నారు.

శాంతి సహనంతో జీవించాలి



మాట్లాడుతున్న షారోన్ కుమార్

రాజమహేంద్రవరం రూరల్: ఏసుక్రీస్తు బోధనలు ప్రపంచానికి శిరోధార్యమని, ఆయన చూపిన బాటలో ప్రజలందరూ శాంతి సహనాలతో జీవించాలని బైబిలు మిషను మహాసభల కన్వీనర్ ఎస్‌జే షారోన్ కుమార్ అన్నారు. స్థానిక మార్గాని ఎస్టేట్స్ ఆవరణలో జరుగుతున్న బైబిలు మిషను 56వ మహాసభల్లో భాగంగా రెండోరోజు బుధవారం వేలమంది దైవజనులు హాజరయ్యారు. షారోన్‌కుమార్, కో కన్వీనర్, పాస్టర్ సుదన్ షారోన్, టి.రతన్‌రాజులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

బాల్కనీ నుంచి జారి పడి మహిళ మృతి

రాజమహేంద్రవరం రూరల్: మానసికస్థితి సరిగ్గా లేని ఓ మహిళ బాల్కనీలోంచి కాలుజారిపడి మృతి చెందిన ఘటన బుధవారం మోరంపూడి 7 హిల్స్ అపార్ట్‌మెంట్ వద్ద జరిగింది. బీహార్‌కు చెందిన అరవింద్ కుమార్ సిన్హా రాజమహేంద్రవరం ఓఎన్‌జీసీలో ఉద్యోగం చేస్తున్నారు. తన తల్లిదండ్రులు, భార్యతో కలిసి మోరంపూడి 7హిల్స్ అపార్ట్‌మెంట్‌లోని మూడో అంతస్తులో నివాసం ఉంటున్నారు. అయితే కొన్నేళ్లుగా అతడి తల్లి సునీతారాణి సిన్హా(51) మానసిక వ్యాధితో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం అపార్టుమెంటు బాల్కనీలో నిలబడిన ఆమె కాలుజారి కింద పడిపోయారు. తలకు బలమైన గాయం కావడంతో ఘటనాస్థలంలోనే మృతిచెందారు. బొమ్మూరు పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆర్.విజయకుమార్, సిబ్బందితో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అరవింద్ కుమార్ సిన్హా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ విజయ కుమార్ తెలిపారు.

నేడు, రేపు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: అత్యవసర మరమ్మతుల నేపథ్యంలో గురువారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. ఉదయం 6 నుంచి 7 గంటల వరకూ రైల్వేస్టేషన్, ఐదుబళ్ల మార్కెట్, కన్నమ్మ తల్లి గుడి వీధి, వినాయక వీధి, రైల్వే స్టేషన్ ఏరియా, కేసరి క్లబ్ వీధి, గవర్నమెంట్ జూనియర్ కాలేజీ, టి.నగర్, కోటిపల్లి బస్టాండ్, ఇన్నీసుపేట, గౌతమ ఘాటు, సుబ్బాయమ్మ ఘాట్ ఏరియాల్లో అంతరాయం కలుగుతుంది.

- శుక్రవారం ఉదయం 9 నుంచి 12 గంటల వరకూ సావిత్రి నగర్, హుకుంపేట, వరలక్ష్మి కాలనీ, జనచైతన్య నగర్, రామకృష్ణనగర్, ఆదర్శనగర్, బాలాజీపేటలో సరఫరా ఉండదు.

కంప్యూటర్ కోడింగ్, జావా కోర్సుల్లో శిక్షణ

రాజానగరం: దివాన్ చెరువులోని డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంప్యూటర్ కోడింగ్, జావా కోర్సుల్లో ఉచిత శిక్షణకు ఆసక్తి ఉన్న వారి నుంచి దరఖాస్తులు కోరుతున్నారు. దివాన్‌చెరువులోని కార్యాలయంలో ఆదివారం నుంచి ప్రారంభమయ్యే ఈ శిక్షణకు ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. ప్రతి ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు తరగతులు జరుగుతాయని నిర్వాహకులు సుంకర వెంకటేశ్వరరావు తెలిపారు.

తొర్రేడు సొసైటీ సేవలు అభినందనీయం



జేఎల్‌జీ గ్రూపు సభ్యులకు చెక్కు అందజేస్తున్న నాబార్డు ఏపీ చీఫ్ జనరల్ మేనేజర్ గోపాల్

రాజమహేంద్రవరం రూరల్: రైతులకు, మహిళలకు తొర్రేడు ప్రాథమిక సహకార సంఘం (సొసైటీ) చేస్తున్న సేవలు అభినందనీయమని నాబార్డు ఏపీ చీఫ్ జనరల్ మేనేజర్ ఎంఆర్ గోపాల్ అన్నారు. బుధవారం ఆయన తొర్రేడు సొసైటీని సందర్శించారు. ఈ సందర్భంగా కస్టమ్ హైరింగ్ సెంటర్‌లో భాగంగా ఇచ్చిన హార్వెస్టర్ మిషన్, ట్రాక్టర్‌ను నాబార్డు సీజీఎం గోపాల్ ప్రారంభించి రైతులతోముఖాముఖి మాట్లాడారు. అనంతరం సొసైటీ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన జాయింట్ లెబిలిటీ గ్రూప్ సభ్యులతో మాట్లాడి వారి ఆర్థిక అవసరాలు అడిగి తెలుసుకున్నారు. తొర్రేడు సొసైటీ రైతులకు రుణాలు ఇవ్వడంతో పాటు ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు సరఫరా చేస్తున్నారన్నారు. ఎంఎస్‌సీలో భాగంగా మహిళలకు జేఎల్‌జీ రుణాలు, బంగారు ఆభరణాలపై రుణాలు ఇవ్వడంతో పాటు సోషల్ రెస్పాన్స్‌బిలిటీలో భాగంగా తొర్రేడులో రూ.70 వేలతో పశువైద్యశాలకు షెడ్డు, గ్రామస్తులకు ఆర్‌వో ప్లాంట్‌ద్వారా సురక్షిత తాగునీరు సంఘపాలకవర్గ సభ్యులు, సీఈవోను అభినందించారు. సొసైటీ లాభాల బాటలో పయనించేందుకు ఆయన పలు సూచనలు చేశారు. సొసైటీ సభ్యుల అభ్యర్థన మేరకు అడిగిన గోల్డ్‌లోన్ జాయింట్ లైబిలిటీ గ్రూపు రుణాలు, బికాంపోనెంట్ రుణాలకు అవసరమైన నిధులు మంజూరు చేస్తామన్నారు.

రహదారి అభివృద్ధికి నిధులు

డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు కుమారులు బాపిరాజు, విజయ్ మాట్లాడుతూ తొర్రేడు పీఏసీఎస్ ఆనుకుని ఉన్న రహదారి నిత్యం రద్దీ కారణంగా ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. అక్కడ నలుమూలల నుంచి ఖాతాదారులు వచ్చే రహదారులను అభివృద్ధి చేయడానికి నిధులు కేటాయించాలన్నారు. అలాగే ట్రైనింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని, రైతులకు ఇచ్చే రుణాల్లో వడ్డీ కొంత మొత్తంలో తగ్గించాలని, రుణపరిమితిని ఏడాది నుంచి మూడేళ్లకు పెంచాలని నాబార్డు సీజీఎంను కోరారు. నాబార్డు డీడీఎం వై.సోమినాయుడు, డీసీసీబీ డీజీఎం శ్రీధర్ చౌదరి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఉప్పులూరి వీరవెంకట సత్యనారాయణ, సంఘ చైర్మన్ చిట్టూరి వెంకట్రావు, సభ్యులు దండమూడి అర్జునరావు, గద్దె సుబ్బారావు, సంఘ ముఖ్యకార్యనిర్వహణాధికారి కేవీవీ సత్యనారాయణ, డీసీసీబీ మేనేజర్ జయ పల్లవి, సూపర్‌వైజర్ అప్పారావు పాల్గొన్నారు.